క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవు



చికెన్ దుకాణంలో కవర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

చిల్లకూరు : దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆయన ఆదివారం గూడూరులోని పలు చికెన్, మటన్ దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వాడినా కేసులు నమోదు చేస్తామన్నారు. గూడూరును ప్లాస్టిక్ రహిత పట్టణంగా తయారుచేద్దామని పిలుపునిచ్చారు.

పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

నాయుడుపేట టౌన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం పాత బస్టాండు వద్ద వున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం నెల్లూరు, తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షులు కనమర్లపూడి సుబ్రమణి, గూడూరు కిషోర్‌కుమార్, మండల అధ్యక్షుడు కోటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కండలేరులో 50.274 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 50.274 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 560, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 80, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలతో నిఘా



పోలీసు స్టేషన్‌లో సీసీ పుటేజీని పరిశీలిస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : నేరాల నియంత్రణకు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. పట్టణంలోని జాతీయ రహదారితో పాటు ప్రధాన కూడళ్లు, బజారు వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురికావడంతో మూలన పడేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆదేశాలతో సీఐ బాబి మళ్లీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 32 సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్‌కు అనుసంధానించారు. ఇంకా పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు సీఐ తెలిపారు. వీటిని 24 గంటలూ పరిశీలిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తిపై దాడి

పెళ్లకూరు: పెళ్లకూరుకు చెందిన దాస రి వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన కోగిలి మణి శనివారం అర్ధరాత్రి కర్రతో దాడి చేశా డు. ఎస్‌ఐ నాగరా జు కథనం మేరకు.. పెళ్లకూరు గ్రామం దళితకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, మద్దూరి దొరబాబు, మణి కలిసి రాత్రి బైక్‌పై సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి దొరబాబు, మణి మద్యం షాపు వద్దకు వెళ్లారు. వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లిపోయాడు. వెంకటేశ్వర్లును వీధి బయటకు రమ్మని పిలిచిన మణి కర్రతో దాడి చేశాడు. వెంకటేశ్వర్లు తలపై గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గూడూరు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు

సూళ్లూరుపేట : ఎన్‌సీసీ శిక్షణ పొంది సీ సర్టిఫికెట్లు సాధించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ పూర్తి చేసుకున్న ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆదివారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ జె.సుబ్రమణ్యం మాట్లాడుతూ సీ సర్టిఫికెట్ ఉన్నత చదువులకు, ఆర్మీలో స్పెషల్ రిక్రూట్‌మెంట్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే అన్ని పోటీ పరీక్షల్లోనూ ఎన్‌సీసీ కోటా వర్తిస్తుందని వివరించారు.

పేట్రేగుతున్న మట్టి మాఫియా

కూటమి నేతలు అధికారాన్ని అడ్డు పెట్టుకుని రెచ్చిపోతున్నారు. సహజ వనరులను ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. చెరువులు, కొండలు, గుట్టలు, కాలువలు, అటవీ భూముల్లోని గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లు, లారీలతో ప్రైవేట్ వెంచర్లు, పరిశ్రమలకు తరలిస్తున్నారు. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుని తమ పరిధి కాదంటూ తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తవ్వకాలు
- వెంచర్లు, పరిశ్రమలకు తరలింపు
- కరిగిపోతున్న కొండలు, గుట్టలు, కాలువలు, చెరువులు
- పట్టించుకోని మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

పెళ్లకూరు: నాయుడుపేట, దొరవారిసత్రం, మేనకూరు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో



రోసనూరు కొండ కింద యంత్రాలతో తవ్వకాలు

కూటమి నేతల కన్ను పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు, రాజుపాళెం, రోసనూరు గ్రామాల్లోని అటవీ భూములు, చెరువు భూములు, తెలుగు గంగ పొర్లు కట్టలపై పడింది. యంత్రాలతో తవ్వి మట్టిని లారీలు, టిప్పర్లతో తరలిస్తున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో లారీలు రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు వెళుతున్నాయి. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్పుడప్పుడూ ఒకటి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని రూ.1000 నుంచి రూ.2 వేలు జరిమానా విధించి రెండు గంటల్లోనే వదిలేస్తున్నారు. ఇటీవల కాసూరు అటవీ ప్రాంతంలో నాయుడుపేట మండలం, అరవపెరిమిడి గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత భారీ యంత్రాలతో అటవీ భూముల్లో తవ్వకాలు చేస్తుండగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న అధికారులు రూ.25 వేలు జరిమానా విధించి వెళ్లిపోయారు. మరో గంట వ్యవధిలో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లారీలతో వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకోవడం విశేషం. అలాగే రెండు రోజుల క్రితం పట్టుబడిన మట్టి ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు రుసుము విధించకుండానే వదిలేశారు. ఆ రోజు నుంచి అక్రమ మట్టి రవాణా ఆగకుండా కొనసాగించడం విశేషం. అలాగే రోసనూరు, రాజుపాళెం అటవీ ప్రాంతాల్లో కొంతకాలంగా అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ లారీలను ఇప్పటి వరకు అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు.



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

చర్యలు తీసుకుంటాం

రోసనూరు, శిరసనంబేడు, రాజుపాళెం చెరువులు, పలు ప్రాంతాల్లోని అటవీ భూములు, అసైన్‌మెంట్ భూములు, తెలుగు గంగ పొర్లు కట్టలను తవ్వి మట్టి తరలిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. అలాగే స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్టు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– ద్వారకానాథ్‌రెడ్డి, తహసీల్దార్, పెళ్లకూరు

కుట్టు శిక్షణకు దరఖాస్తులు

రాపూరు: ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే కుట్టు శిక్షణకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భవాని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని, శిక్షణానంతరం కుట్టుమిషన్, సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. మహిళలు తెల్లరేషన్ కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

21న క్రికెట్, టెన్నిస్ జట్ల ఎంపిక

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని విశ్వోదయ మైదానంలో 21న అండర్ 19 బాలురు, బాలికల టెన్నిస్, క్రికెట్ జిల్లా జట్లు ఎంపిక చేయనున్నట్టు తిరుపతి జిల్లా టెన్నిస్‌బాల్, క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవరాజు, సెక్రటరీ మనోహర్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు ఏప్రిల్ 5, 6 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కల వారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని, వివరాలకు 9490252821లో సంప్రదించాలన్నారు.

అందుబాటులోకి గోడౌన్

చిల్లకూరు : గత ప్రభుత్వ హయాంలో రైతులకు సౌకర్యంగా ఉండేలా అంకులపాటూరులో నిర్మించిన గోడౌన్ రైతులకు అందుబాటులోకి వచ్చింది. చిల్లకూరు పీఏసీఎస్ సీఈవో రామానాయుడు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోడౌన్‌ను అద్దెకు ఇవ్వనున్నట్టు తెలిపారు. 75 కేజీల బస్తాకు నెలకు రూ.10లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తీరప్రాంతంలోని రైతులకు ఈ గోడౌన్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేద్దామని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. ఆయనను ఆదివారం గూడూరులోని సనత్‌నగర్‌లోని స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం త్వరలోనే ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు కటికాల శేషగిరి, రైతు విభాగం అధ్యక్షుడు యల్లా శ్రీనివాసులురెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, నాయకులు కొండూరు సునీల్‌రెడ్డి, కొట్ట అశోక్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

గూడూరు రూరల్ : దేవాంగులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దేవాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్ కుమార్ కోరారు. ఆయన ఆదివారం గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం చెన్నూరులో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బాగా చదివే దేవాంగ పేద విద్యార్థులు, అనారోగ్యంతో బాధపడేవారికి ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. దేవాంగుల సమస్యల పరిష్కారానికి సంఘం తరపున శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, ఉపాధ్యక్షుడు కటికాల శేషు, కర్ణా చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు మధిర బాలయ్య, కొండా శేఖర్, చెన్నూరు దేవాంగ సంఘం అధ్యక్షుడు జాగాబత్తిన శ్రీనివాసులు, హరికృష్ణ, సునీల్, చంద్ర, రమేష రాఘవ, రమణయ్య, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

జాతరను ఘనంగా నిర్వహిద్దాం

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జాతరను ఘనంగా నిర్వహిద్దామని గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం గూడూరులోని తన కార్యాలయంలో జాతర ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ముత్యాలమ్మ జాతరకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

జాతర నిర్వహణకు సేవా కమిటీ

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ జాతరకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడికి ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అలాంటి జాతర నిర్వహణకు కూటమి ప్రభుత్వం ఎలాంటి అనుభవం లేని వారితో త్రీ మ్యాన్ సేవా కమిటీని నియమించింది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముత్యాలమ్మ ఆలయానికి ఆదాయం బాగానే ఉంది. దీనికి చైర్మన్‌గా పనిచేయాలని చాలా మంది పోటీ పడుతుంటారు. గత ప్రభుత్వ హయాంలో గూడూరు పట్టణానికి చెందిన సిద్దారెడ్డి జనార్దనరెడ్డి సతీమణి సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మను చైర్ పర్సన్‌గా ఎంపిక చేసి మరో 12 మందిని సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ కాల పరిమితి ఈ నెల 26వ తేదీ వరకు ఉంది. 25 నుంచి 29 వరకు జాతర నిర్వహించాల్సి ఉండడంతో పాత కమిటీ స్థానంలో దేవదాయ శాఖ త్రీ మ్యాన్ కమిటీని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఈ కమిటీలో స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సుల మేరకు మూడు పార్టీలకు చెందిన వారిని ఎంపిక చేశారు. అధికార పార్టీకి చెందిన ఒకరి కుటుంబ సభ్యులు గత కమిటీలో ఉన్నారు. వారికి జాతర నిర్వహణలో కొంత అనుభవం ఉంది. మిగిలిన ఇద్దరు ఇతర మండలాలకు చెందిన వారు కావడంతో జాతర గురించి అవగాహన లేదు. వారి నియామకంపై అధికార పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అలాగే అనుభవం లేని వారిని జాతరకు సేవా కమిటీ పేరుతో నియమించడం వల్ల ఏదైనా జరిగితే తప్పు తమపై పడుతుందని దేవదాయశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతర నిర్వహణలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో చూడాల్సి ఉంది.



ముత్యాలమ్మ ఆలయం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

వరదయ్యపాళెం: మండలంలోని నక్కలమిట్ట వద్ద ఆదివారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. శ్రీసిటీ ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. బత్తలవల్లంకు చెందిన సుబ్రమణ్యం ఆదివారం వీకేఆర్‌వైకాలనీకి వచ్చి తిరిగి ఇంటికి బయల్దేరాడు. మాదరపాకంకు చెందిన జనార్దన్ చిన్న పాండూరుకు వచ్చి బైకుపై వెళ్తుండగా నక్కలమిట్ట వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో సుబ్రమణ్యం, జనార్దన్ గాయపడ్డారు. వారిని సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిగ్రీ కళాశాల మైదానం పరిరక్షణకు చర్యలు

నాయుడుపేట టౌన్ : నాయముడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని రక్షించుకునేందుకు విద్యార్థులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ప్రిన్సిపాల్ మధుసూదనవర్మ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కళాశాల మైదానంలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రిళ్లు మందు బాబుల ఆగడాలు మితిమీరుతున్నట్లు వెల్లడించారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో మైదానాన్ని రక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా మైదానాన్ని సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరామన్నారు. హద్దులు ఏర్పాటుచేసి ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మైదానం పరిరక్షణకు సోమవారం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి శాంతి యుతంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యాక్రమంలో పూర్వ విద్యార్థులు, ప్రజలు పాల్గొని మద్దతు తెలిపాలని కోరారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ



పేద వృద్ధులకు ఫలసరుకులు అందజేస్తున్న సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సీవీసీ పార్కులో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో ఒగ్గు భాస్కర్ దాతృత్వంతో ఎంఈవో–2 రవూఫ్ దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఎంఈవో–2 రవూఫ్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రతినెలా మూడో ఆదివారం కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. జేవీవీ ఉపాధ్యక్షుడు చెంచునారాయణ మాట్లాడుతూ వృద్ధులు ఉదయం 11 గంటల తర్వాత ఎండలో తిరగవద్దని, కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం, మంచి నీరు తాగాలని కోరారు. అలాగే డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఆర్‌రెడ్డి ఆసరా పథకం కింద నిరుపేదలకు నెలకు సరిపడా సరుకులు అందజేశారు. సంఘం ప్రతినిధి సనత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాతలు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణికి కృతజ్ఞతలు తెలిపారు.

కనుల పండువగా శాంతి కల్యాణం

చిట్టమూరు : మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చారు. తదుపరి వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. కుజదోషం ఉన్న వారు హోమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

దుంపా రామచంద్రారెడ్డికి నివాళి

సైదాపురం : వైఎస్సార్ సీపీ కలువాయి మండల మాజీ కన్వీనర్ దుంపా రామచంద్రారెడ్డి దాచూరులోని తన నివాసంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాచూరు చేరుకున్నారు. దుంపా రామచంద్రారెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.



దుంపా రామచంద్రారెడ్డి పార్థవదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఓపెన్ పరీక్షలు పక్కాగా జరిగేనా?

వెంకటగిరి రూరల్ : దూర విద్యను ప్రోత్సహించేందు ఉద్దేశించిన సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలను సోమవారం నుంచి రెగ్యులర్ విద్యార్థులతోపాటు నిర్వహించనున్నారు. వెంకటగిరిలో రెండు పరీక్షా సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో 170 మంది పరీక్షలు రాయనున్నారు. ఇటీవల వెంకటగిరిలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో కొంతమంది అధికారులు, చీఫ్, ఇన్విజలేటర్లకు భారీగా ముడుపులు ఇచ్చి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఓపెన్ టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేయిస్తామని చెప్పి విద్యార్థుల నుంచి వేలకు వేలు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో కష్టపడి చదివే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లా అధికారులు దృష్టిసారించి పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.

డివిజన్‌లో 50 టెన్త్ పరీక్షా కేంద్రాలు

- హాజరు కానున్న 9378 మంది విద్యార్థులు
- పక్కాగా ఏర్పాట్లు: డీవైఈవో సనత్‌కుమార్

చిల్లకూరు/కోట/వెంకటగిరి రూరల్/పెళ్లకూరు : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో 50 కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు డీవైఈవో సనత్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేట పట్టణాల్లో ఏ కేటగిరి కింద 26 పరీక్షా కేంద్రాలు, 19 మండల స్థాయి పాఠశాలల్లో బీ కేటగిరి కింద పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. సీ కేటగిరి కింద చిల్లకూరు మండలంలోని తిక్కవరం, వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఓజిలి మండలంలోని చిలమానుచేను జెడ్పీ ఉన్నత పాఠశాల, కోట మండలం చిట్టేడులోని గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటిలో మొత్తం 9378 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరిలో 8,427 మంది రెగ్యులర్, ఒకసారి పరీక్ష తప్పి మళ్లీ పరీక్షకు హాజరయ్యే వారు 547 మంది, ఓపెన్ స్కూల్ కింద 377 మంది ఉన్నారని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు పెట్టినట్టు తెలిపారు. సమీపంలో జిరాక్స్ షాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, తాగునీరు, విద్యుత్ వసతి తదితరాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

సైదాపురంలో..


సైదాపురం : సైదాపురం, కలిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో 265 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈవో దయాకర్ తెలిపారు. వీటిలో అనంతమడుగు, చాగణం, మర్లపూడి, గిద్దలూరు, ఊటుకూరు, కలిచేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

రాపూరులో..

రాపూరు: పదో తరగతి పరీక్షలకు రాపూరు మండలంలో సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 164 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 170 మంది, కండలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.

సిద్ధాంతాలు లేని వ్యక్తి పవన్ కళ్యాణ్

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి



నాయుడుపేట టౌన్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఒక సిద్ధాంతమంటూ లేదని, ఏది పడితే అది మాట్లాడడం ఆయనకు అలవాటని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం నాయుడుపేటలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పిఠాపురంలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ వైఎస్సార్ సీపీని విమర్శించడం దారుణమన్నారు. గతంలో పవన్ కల్యాణ్ రెండు చోట్ల పోటీచేసి ఓడిపోయారని గుర్తు చేశారు. ఆయన గెలిచేందుకు 11 ఏళ్లు పట్టిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒంటరిగా పోటీ చేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకున్నారని తెలిపారు. ప్రజల్లో వైఎస్ జగన్‌కు ఎంత ఆదరణ ఉందో తెలుసుకోవాలని సూచించారు. రోజుకో విధంగా మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని తమ పార్టీపై విమర్శలు చేయడం మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని హితవు పలికారు.

BEST OF LUCK

నేటి నుండి పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత పౌరులుగా ఎదగాలని మనసారా ఆకాంక్షిస్తూ...

K.R.CHARITABLE TRUST
FOUNDER
V.KALYAN REDDY
Sirasanambedu - Pellakuru(M)

శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం
తూర్పు కనుపూరు గ్రామం, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

ప్రకటన నెం.01/2025 తేది: 11-03-2025

సీల్డ్ టెండర్లు – బహిరంగ వేలం ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై దేవస్థానమునకు చెందిన ఈ క్రింది కనపరిచిన లైసెన్స్ హక్కులకు గాను సీల్డు టెండరు మరియు బహిరంగ వేలంపాటలు తేది. 21-03-2025 శుక్రవారం ఉదయం 11.00 గం॥లకు జరుగును. టెండర్ షెడ్యూల్ కొరకు రూ॥500/-లు చెల్లించి పొందవచ్చును. ధరావత్తుతో పాటు టెండర్ షెడ్యూల్ తేది. 21-03-2025 ఉదయం 11-00గం॥ల లోపు టెండర్ బాక్సు నందు వేయవలయును. అదే రోజు మధ్యాహ్నం 12.00 గం॥లకు దేవాదాయశాఖ అధికారుల సమక్షములో సీల్డ్ టెండర్లు తెరవబడును. ఈ క్రింది తెలిపి లైసెన్స్ హక్కులకు పాట తెగిన వెంటనే హెచ్చు పాటదారులు పాట మొత్తమును చెల్లించవలెను. తదుపరి ఆమోదము కొరకు ఉన్నతాధికారులకు పంపబడును.

జాతర తదుపరి లైసెన్స్ హక్కుల వేలం పాట వివరములు

వ.నెం.	వివరములు	ధరావత్తు	కాలపరిమితి
1.	తలనీలాలు సేకరించుహక్కు	రూ. 2,00,000/-	తేది 03-04-2025 నుండి తేది 02-03-2026 వరకు
2	శ్రీ అమ్మవారికి భక్తులు సమర్పించిన [illegible] హక్కు	రూ. 2,00,000/-	-do-
3	దేవస్థాన ప్రాంగణములో పుష్పము, పూలమాలలు అమ్ముకొను హక్కు.	రూ. 50,000/-	-do-

పై లైసెన్స్ హక్కుల పూర్తి వివరముల కొరకు పాట సమయములో గాని ముందుగా గాని పై కార్యాలయమునందు తెలుసుకొనవచ్చును.

కార్యనిర్వహణాధికారి సెల్: 9603305591

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్లూరుపేట : 90102 23710